క్లుప్తంగా

సబ్‌జైలు పరిశీలన

తెనాలి రూరల్: తెనాలి సబ్‌జైలును రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేటట్ జె. శ్రీసీత శనివారం సాయంత్రం పరిశీలించారు. జైలు ఆవరణను పరిశీలించి ఖైదీల వసతుల గురించి ఆరాతీశారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, తాగునీటిని పరిశీలించారు. అనంతరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఖైదీలతో మాట్లాడారు. క్షణికావేశంలో చేసిన తప్పుల వల్ల జైలుపాలు కావాల్సి వచ్చి ఉంటుందని, ఇకనైనా మారి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. తాగునీరు, ఫాగింగ్ విషయమై జైలు సిబ్బందికి సూచనలు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, ప్యానల్ న్యాయవాది అప్పల కిషోర్, న్యాయసేవావాధికార సంస్థ సిబ్బంది మహబూబ్. పీఎల్‌వీ యర్రంశెట్టి అనిల్‌కుమార్ న్యాయమూర్తితో ఉన్నారు.

డెంగీపై అవగాహన ర్యాలీ



తెనాలిఅర్బన్: డెంగీపై అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్ సూచించారు. డెంగీ మాసోత్సవాల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయం నుంచి శనివారం ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దోమ కాటు వల్ల పలు వ్యాధులు వ్యాపిస్తాయని చెప్పారు. వర్షాకాలంలో ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్యాధికారి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఇన్‌చార్జి అసిస్టెంట్ మలేరియా అధికారి వంగాల పున్నారెడ్డి, ఎన్‌సీసీ అధికారి స్వామి, ఎన్‌సీసీ ఆర్మీ వింగ్ ఆఫీసర్ పులి భాస్కరరావు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



తెనాలిరూరల్: దేశ విదేశాల్లో వివిధ రంగాల్లో స్థిరపడిన వారంతా చిన్న నాటి స్నేహితులను కలుసుకునేందుకు ఒక చోటికీ చేరారు. 34 ఏళ్ల క్రితం స్కూల్లో కలిసి చదువుతున్న రోజుల ఆ పాత మధురాలను గుర్తు చేసుకుని చిన్న పిల్లలయ్యారు. ఉన్నతోద్యోగాల్లో స్థిరపడిన వీరు రోజూ సార్, మేడమ్ అన్న పలకరింపులకు విరామం కల్పిస్తూ చిన్న నాటి మిత్రులతో ఏరా !, ఎంటే అన్న ఆత్మీయ పలకరింపులతో పులకరించారు. ఏం శ్రీను ఏం చేస్తున్నావు.. పిల్లలు ఎంత మంది..ఏం చదువుతున్నారు..నువ్వెలా ఉన్నావ్. అరే భాను నీ సంగతేంట్రా.. అంటూ పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పలకరించుకుంటుంటే ఆ హాలులో సందడి నెలకొంది. తెనాలి మండలం సంగంజాగర్లమూడి జెడ్పీ హైస్కూలులో 1988–89 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ×ఆత్మీయ కలయిక® ఆదివారం జరుపుకున్నారు. ఇందుకు శనివారం సుల్తానాబాద్‌లోని ఓ హోటల్‌ను వేదికగా చేసుకున్నారు. ఆ రోజుల్లో సువిశాలమైన పాఠశాల ఆవరణలో ఎక్కడెక్కడ ఎక్కువ సమయం గడిపేవారు, ఎవరెవరు కలిసి ఉండే వారు వంటి పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చుకున్నారు.

ప్రతిపక్షాల రాజకీయ పునాదులు కదులుతున్నాయ్

- అందుకే వలంటీర్ల వ్యవస్థపై పిచ్చి ఆరోపణలు చేస్తున్నారు
- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



జగనన్న సురక్ష సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: సంక్షేమ పథకాలతో లబ్ధిదారులకు నేరుగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు వేయటం, ప్రతినెల ఒకటో తేదీనే ఇంటివద్దకొచ్చి అవ్వాతాతలకు పింఛను మొత్తాన్ని అందజేస్తున్నది ఆంధ్రప్రదేశ్‌లో మినహా దేశంలో మరే రాష్ట్రంలోనూ లేదని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణంలోని 33, 34 వార్డులకు జగనన్న సురక్ష ప్రత్యేక సభను శనివారం బాలాజీరావుపేటలోని గడ్డిపాటి వారి కల్యాణ మండపంలో నిర్వహించారు. ఏసీపీ సుబ్బారావు అధ్యక్షత వహించారు. ఈ సభలో 261 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను ఎమ్మెల్యేఅన్నాబత్తుని శివకుమార్ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, వలంటీరు, సచివాలయ వ్యవస్థలను ఏర్పాటుచేసి, సంక్షేమాన్ని నియోజకవర్గంలో 36 వేల మందికి పింఛను పంపిణీని ప్రతినెలా ఒకటో తేదీనే ఏమాత్రం అవినీతి లేకుండా ప్రజలకు అందజేస్తున్నట్టు గుర్తుచేశారు. వలంటీర్లు డేటా అమ్ముకుంటున్నారని ఆరోపిస్తున్నారని చెబుతూ, కేంద్రప్రభుత్వ ఆధార్‌లో వివరాలు లేవా? అని ప్రశ్నించారు. అర్హులైన ప్రజలచేత దరఖాస్తులు చేయించి, పథకం వచ్చాక డబ్బులు పడతాయని చెప్పడం, నెలనెలా ఇంటికొచ్చి పింఛన్లు ఇస్తూ సాయపడుతున్న వలంటీర్ల సేవల్లో ఏం నేరముందని ప్రశ్నించారు. జనసేన పార్టీ, టీడీపీ, కాంగ్రెస్, కమ్యూనిస్టుల పార్టీలకు చెందిన పేదలక్కూడా సంక్షేమం అందించిన ఘనత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. ప్రజలను ఇంత ప్రేమగా చూసుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని, తనను ఆశీర్వదించాలని కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, కమిషనర్ ఎం.జస్వంతరావు, 33, 34 వార్డుల కౌన్సిలర్లు మొగల్ అహ్మద్, పేరం సంజీవరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు బచ్చనబోయిన శ్రీనివాసరావు మాట్లాడారు. వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, జలవనరుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, కౌన్సిలరు షేక్ దుబాయ్‌బాబు, మేదర కార్పొరేషన్ డైరెక్టర్ వీరరామారావు, ఆరెంపీ శ్రీను, దేవరకొండ శంకరరావు, మోహన్ పాల్గొన్నారు.

కొలకలూరులో జగనన్న సురక్ష

కొలకలూరు(తెనాలి): ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే తెనాలి నియోజకవర్గం సంక్షేమ పథకాల అమలుతోపాటు జగనన్న సురక్ష కార్యక్రమంలోనూ జిల్లాలో అగ్రగామిగా నిలిచిందని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లించారు. రూరల్ మండలం కొలకలూరులోని సచివాలయం–2 పరిధిలో జగనన్న సురక్ష ప్రత్యేక సభను శనివారం నిర్వహించారు. తెనాలి ఎంపీడీఓ ఎల్.వి జయాలక్ష్మిణ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ రూరల్ మండలం కొలకలూరులో సచివాలయం–2 పరిధిలోనే ప్రజలకు రూ.40.16 కోట్ల సంక్షేమాన్ని అందించగలిగినట్టు చెప్పారు. సంక్షేమంలో జిల్లాలోనే అగ్రగామిగా ఉన్న తెనాలి నియోజకవర్గంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని కూడా విజయవంతం చేయగలిగినట్టు ఎమ్మెల్యే చెప్పారు. జగనన్న సురక్షలో కొలకలూరు సచివాలయం–2లో 1846 మందికి 11 రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేశామని వివరించారు. వైస్‌ఎంపీపీ కోడూరు స్వప్న, ఎంపీటీసీ దోసపాటి నాగదేవిక, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, విద్యాకమిటీ చైర్మన్ పినపాటి అనిల్‌కుమార్, కోడూరు లోక, కొలకలూరి నాగేశ్వరరావు, ప్రసాదం సురేష్, రావూరి రవిబాబు, కొలకలూరు చలమయ్య, మల్లవరపు బుల్లియ్య, వీరమల్ల కార్తికేయ పాల్గొన్నారు.

తెనాలిఅర్బన్‌లో...

తెనాలిఅర్బన్: పేద ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీఠ వేస్తూ మనసున్న వ్యక్తిగా నిరూపించారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. జగనన్న సురక్ష ముగింపు సమావేశాన్ని మున్సిపల్ కార్యాలయంలో మెప్మా షెడ్డులో శనివారం నిర్వహించారు. సమావేశానికి శానిటరీ ఇన్‌స్పెక్టరు ఆకురాతి రామచంద్రరావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వం అందించని సంక్షేమాన్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిస్తోందని చెప్పారు. వృద్ధులు, వికలాంగులు, దివ్యాంగులు పింఛన్ కోసం పడుతున్న ఇక్కట్లు చూడలేక ఒకటో తారీఖున ఉదయం ఆరు గంటలకే వలంటీర్లు ద్వారా లబ్ధిదారుల ఇళ్ళ వద్దే పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు గుర్తు చేశారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. తెనాలి పట్టణంలో జగనన్న సురక్ష పథకం ద్వారా 9,318 సర్టిఫికెట్లు లబ్ధిదారులకు అందించినట్లు చెప్పారు. జగనన్న సురక్ష పథకం జిల్లాలోనే మొట్టమొదట పూర్తి చేసిన నియోజకవర్గం తెనాలేనని చెప్పారు. అధికారులు, కౌన్సిలర్లు, సిబ్బంది సమిష్టి కృషితోనే ఇది సాధ్యపడిందన్నారు. వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, కౌన్సిలర్లు తోట రఘురామ్, ఆవుల కోటయ్య, పేరం సంజీవరెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు బచ్చనబోయిన శ్రీనివాసరావు, పెద్బింగ్ సుభానీ, అసిస్టెంట్ కమిషనర్ అనూష, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మన్నవ ప్రభాకర్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శ్రామిక మహిళల పోరాటాలే 'చీకటిపువ్వు' కథలు

చర్చావేదికలో ప్రముఖ రచయిత్రి రమాసుందరి



మాట్లాడుతున్న రమాసుందరి, వేదికపై రవిబాబు, నాగేశ్వరరావు, కత్తి పద్మ

తెనాలి: నదీప్రవాహానికి ఎదురీదే పులసలా తమకు నచ్చని అంశాలపై శ్రామిక మహిళలు చేసే పోరాటాన్ని అక్షరీకరించినవే 'చీకటిపువ్వు' కథాసంపుటిలోని కథలని ప్రముఖ రచయిత్రి రమాసుందరి అన్నారు. అధోజగత్ ప్రజలను తన కథలకు పాత్రలుగా తీసుకుని పాఠకుల ఎదుట నిలిపిన తొలి రచయిత రావి శాస్త్రిగా గుర్తుచేశారు. ఆ తరహాలోనే తాను విన్న అధోజగత్ మహిళల్లో ధీరుల వాస్తవిక జీవితాలతో కత్తి పద్మ, మంత్రముగ్ధులను చేసే కథలను రచించినట్టు చెప్పారు. ఈ కథల్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలనీ, ఇందులోని ప్రతిపాదనలకు సమాజం ఆమోదం రావాలని అభిప్రాయపడ్డారు. కథాసాహిత్యంలో కత్తి పద్మ కథలకు ముందు, ఆ తర్వాత అనాలని సూచించారు. పట్టణ సాంస్కృతిక సంస్థ 'భిన్నస్వరాలు' ఆధ్వర్యంలో ఆహ్వానం లక్ష్మి సంస్మరణలో భాగంగా శనివారం రాత్రి ఇక్కడి కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో కత్తి పద్మ కథా సంకలనం 'చీకటిపువ్వు'పై చర్చావేదికను నిర్వహించారు. ప్రజాసాహితి ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు తన ప్రసంగంలో, చీకటిపువ్వు సంకలనంలోని అన్ని కథల్లోని పాత్రలు, పితృస్వామిక విలువలను ధిక్కరించేవిగా చెప్పారు. రావి శాస్త్రిలా పాత్రలకు మాత్రం ఉత్తరాంధ్ర మాండలికం పెట్టిన రచయిత్రి, మిగిలినది మామూలు భాషలో రాశారని చెప్పారు. కవి జుగాష్‌విలి, కనపర్తి బెన్‌హర్, లలితానంద్ పాల్గొన్నారు. రాఘవరెడ్డి స్వాగతం పలికారు.

నలుగురు గంజాయి విక్రేతలు అరెస్ట్



తెనాలిరూరల్: తెనాలిలో గంజాయి విక్రయిస్తున్న యువకులను పోలీసులు అరెస్ట్ చేశారు. టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో గంజాయి విక్రయిస్తున్న వారి వివరాలను డీఎస్పీ బి.జనార్ధనరావు తెలియజేశారు. తెనాలి మండలం కొలకలూరుకు చెందిన అయిలా శ్రీనివాస్, ఐతానగర్‌కు చెందిన గుంజి లూర్దురాజు పాత నేరస్తులు. గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారు. వీరికి గాంధీనగర్‌కు చెందిన బత్తిన అజయ్ కుమార్, బీసీ కాలనీకి చెందిన కూతాడి గోపి పరిచయం కాగా అంతా కలిసి జల్సాలు చేస్తూ, గంజాయి మత్తు పదార్థాలకు అలవాటు పడ్డారు. తేలికగా డబ్బు సంపాదించేందుకు కొంత కాలంగా గంజాయి అమ్మకాలు చేస్తున్నారు. అరకు నుంచి గంజాయి తీసుకువచ్చి వీరు తాగడంతో పాటు మిగిలినది చిన్న చిన్న పొట్లాలుగా చేసి అమ్మడం మొదలు పెట్టారు. వీరి అక్రమ వ్యాపారంపై సమాచారంతో నిఘా ఉంచిన టూ టౌన్ పోలీసులు ఐతానగర్‌లోని క్రిస్టియన్ శ్మశాన వాటిక వద్ద గంజాయి పొట్లాలు కడుతుండగా అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద రూ.16 వేల విలువ చేసే 1600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. గంజాయి, మాదకద్రవ్యాల విక్రయాలు జరిపినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో టూ టౌన్ సీఐ ఎస్.వెంకట్రావు, ఎస్‌ఐలు రమేష్ బాబు, నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో ఇరు పక్షాలకు మేలు

11వ అదనపు జిల్లా న్యాయమూర్తి మాలతి



అదాలత్ సమావేశానికి అధ్యక్షత వహించిన న్యాయమూర్తి మాలతి

తెనాలిరూరల్: కేసుల సత్వర పరిష్కారం కోసం లోక్ అదాలత్ చక్కటి వేదిక అని, తద్వారా కక్షిదారుల సమయం, ధనం ఆదా అవుతుంది అని 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి, తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ జి. మాలతి చెప్పారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం, రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సూచనలు మేరకు శనివారం స్థానిక 11వ అదనపు జిల్లా న్యాయస్థానంలో మోటార్ వాహనాల ప్రమాద పిటిషన్లు, భూమి సంబంధిత పిటిషన్లు పరిష్కారం కోసం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాలతి మాట్లాడుతూ ప్రస్తుతం నమోదు అవుతున్న కేసుల్లో చాలా వరకు కూర్చొని మాట్లాడుకుంటే పరిష్కారం అవుతాయని కానీ కక్షిదారులు అనవసరమైన భేషజాలకు వెళ్లి సమయాన్ని, ధనాన్ని వృథా చేసుకుంటున్నారని అన్నారు. న్యాయస్థానంలో కేసులు జరిగితే ఎవరో ఒక్కరే విజయం సాధిస్తారని, అదే మధ్యవర్తిత్వం ద్వారా లోక్ అదాలత్‌లో రాజీ పడితే ఇరుపక్షాలు విజయం సాధిస్తారని పేర్కొన్నారు. ఈ లోక్ అదాలత్‌లో ఐదు మోటార్ వాహన ప్రమాద పిటిషన్లు రాజీ అయ్యాయి. బాధితులకు రూ. 31,65,000 పరిహారం అందించారు. లోక్ అదాలత్ సభ్యురాలు టి రాజ్యలక్ష్మి, న్యాయవాదులు రామకృష్ణ, నాంచారయ్య, కిషోర్, సిబ్బంది మహబూబ్, కక్షిదారులు పాల్గొన్నారు.

ప్రతి రోజు సైక్లింగ్ చేయండి

ఎమ్మెల్యే శివకుమార్



సైక్లింగ్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలిఅర్బన్: ప్రతి రోజు సైక్లింగ్ చేయడం వల్ల శారీరక వ్యాయామం, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్ బెర్రీ స్కూల్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన సైక్లింగ్‌ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆయన కొద్దిసేపు విద్యార్థులతో కలిసి సైకిల్ తొక్కారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మపర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, డీఎస్పీ డి.జనార్ధనరావు, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, స్కూల్ ప్రిన్సిపల్ టీవీఎస్.సుబ్రమణ్యం, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఆదినారాయణ, బిజినెస్ డెవలెప్‌మెంట్‌మ మేనేజర్ నంబూరి శ్రీనివాస్, పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

- గుంటూరు, బాపట్ల జిల్లాల్లో పలు నేరాలు చేసినట్టు గుర్తించిన పోలీసులు
- రూ. 99 వేల సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న సీఐ చంద్రశేఖర్

తెనాలిరూరల్: సైకిల్‌పై వెళుతున్న వృద్ధురాలిని అటకాయించి బెదిరించడంత పాటు, ఆమె బ్యాగును లాక్కెళ్లిన కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితులను విచారించగా వారు చేసిన పలు చోరీ కేసుల వివరాలు తెలుసుకుని రూ. 99 వేల విలువైన సొత్తును రికవరీ చేశారు. స్థానిక వన్‌టౌన్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ కె.చంద్రశేఖర్ వివరాలు వెల్లడించారు. తెనాలి రజకచెరువు ప్రాంతానికి చెందిన కోలా రత్నరాజు, చీరాల విజిలీపేటకు చెందిన 17 ఏళ్ల బాలుడు(ప్రసుత్తం తెనాలి ఐతానగర్‌లో నివాసం) స్నేహితులు. చెడు అలవాట్లకు బానిసలైన వీరు సునాయాసంగా డబ్బు సంపాదించేందుకు చోరీలను మార్గంగా ఎంచుకున్నారు. ఈ నెల 14వ తేదీన తెనాలి నాజరుపేటలో సైకిల్‌పై వెళుతున్న 62 ఏళ్ల వృద్ధురాలిని అటకాయించారు. ఆమె సైకిల్ ముందుభాగంలోని బుట్టలో ఉన్న బ్యాగును లాక్కువెళ్లారు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించగా వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను గుర్తించారు. నిందితులిద్దరూ తెనాలి వన్ టౌన్, టూ టౌన్, కొల్లిపర, రేపల్లె, చేబ్రోలు పోలీస్ స్టేషన్ల పరిధిలో పలు చోరీలు చేసినట్టు గుర్తించారు. వీరు ఇచ్చిన సమాచారం మేరకు రూ. 99 వేల విలువైన రెండు మోటారుసైకిళ్లు, రూ. 3వేల నగదును స్వాధీనపర్చుకున్నట్టు సీఐ వెల్లడించారు. రత్నరాజుపై 11 చోరీ కేసులు, రెండు దాడి కేసులు ఉన్నట్టు తెలిపారు. కేసు చేధనలో సమర్ధవంతంగా వ్యవహరించిన ఎస్‌ఐలు ఉమామహేశ్వరరావు, డేవిడ్, ఏఎస్‌ఐ రత్నరాజు, పీసీలు శ్రీనివాసరావు, షరీఫ్‌లను అభినందించారు.

సంక్షిప్త వార్తలు

మృతుడి ఆచూకీ గుర్తింపు

తెనాలిరూరల్: తెనాలి మున్సిపల్ మార్కెట్ కాంప్లెక్స్‌లో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చిన సంగతి తెలిసిందే. మృతుడిని బాపట్ల జిల్లా జంపని గ్రామానికి చెందిన జాన్‌సైదా(36)గా గుర్తించారు. మృతుడు తెనాలిలో బంగారు ఆభరణాల పనులు చేస్తుంటాడని, మృతికి గల కారణాలు దర్యాప్తులో తెలుస్తాయని పోలీసులు వెల్లడించారు.


బెల్టు షాపు నిర్వాహకుడి అరెస్ట్

తెనాలిరూరల్: బెల్టు షాపు నిర్వాహకుడిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) అధికారులు అరెస్ట్ చేశారు. కొల్లిపర మండలం అన్నవరం గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో తెనాలి ఎస్‌ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం, సిబ్బంది శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. గ్రామంలో బెల్టు షాపును గుర్తించి 15 మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు.

నలుగురు జూదరుల అరెస్ట్

కొల్లిపర: కొల్లిపర గ్రామ శివారులో కరకట్ట దిగువున కృష్ణా నదిలో శనివారం సాయంత్రం సమయంలో నలుగురు వ్యక్తులు రహస్యంగా పేకాట ఆడుతుండగా అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ ఆర్ రవీంద్రరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ పేకాట ఆడుతున్న వ్యక్తుల దగ్గర నుంచి రూ.5,370 స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఓటర్ల నమోదు సర్వే పరిశీలన



ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దారు నాంచారయ్య

కొల్లిపర: ఓటర్ల జాబితా సవరణలో భాగంగా బీఎల్ ఓలు చేపట్టిన ఇంటింటా సర్వేను తహసీల్దార్ జి.నాంచారయ్య శనివారం పరిశీలించారు. కొల్లిపర, గుదిబండివారిపాలెం గ్రామాల్లో ఆయన సందర్శించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు.18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. తప్పులు లేని ఓటర్ల జాబితా తయారీకి ప్రజలు తమ వంతు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ సాయి, సురేష్, కళాధరి తదితరులు పాల్గొన్నారు.